క్లుప్తంగా

కుర్చీల వితరణ



కేజీబీవీ ఎస్‌ఓకు కుర్చీలు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయుడు

సారవకోట: మండల కేంద్రంలోని కేజీబీవీకి కిడిమి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రావాడ యోగేశ్వరరావు రూ.10 వేల విలువ గల కుర్చీలను ఎంఈఓ ఎం.వి.రమణ ఆధ్వర్యంలో బుధవారం అందించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కుర్చీలను అందజేసినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 భూలక్ష్మి, కేజీబీవీ సిబ్బంది, సీఆర్పీ ప్రసాద్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

మెళియాపుట్టి: వాహనచోదకులు రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మెళియాపుట్టి ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలో వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం, వాహన పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటిన చిన్నారులు, ఉపాధ్యాయులు

హిరమండలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.కేశవరావు అన్నారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల చిన్నారులకు నిర్వహించిన ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో ప్రత్యేక అవసరాల చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులు సీతంనాయుడు, గోవిందరావు, ఫిజియోథెరపిస్టు గ్రేసీ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

తురకపేట పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించే బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని టాస్క్‌ఫోర్స్ వైద్య బృందం సభ్యులు, డీపీఎంఓ డాక్టర్ రవీంద్ర, డీపీహెచ్ ఎన్‌ఓ శైలజ అన్నారు. మండలంలోని తురకపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవం వరకు ప్రభుత్వ ఆస్పత్రి నుంచే మెరుగైన వైద్యంతోపాటు అన్ని రకాల మందులు అందేలా చూడాలన్నారు. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం మురళి, డాక్టర్ లక్ష్మీదీప్, వైద్య సిబ్బంది ఈశ్వరమ్మ, విమలరావు, ఆరుద్ర, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం




అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

కొత్తూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ అన్నారు. మండలంలోని మహర్తాపురం కాలనీలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు అడిగితే గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. మహిళలు బంగారు ఆభరణాలు వేసుకొని బయటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను మద్యం తాగి, ఫోన్‌లో మాట్లాడుతూ నడపకూడదన్నారు. గ్రామాల్లో గంజాయి, మద్యం అమ్మకాలు, అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

నీరుగారిన ఆశయం

- అడుగంటిన వెన్నెలవలస జలాశయం
- రబీకి తప్పని సాగునీటి కష్టాలు



జలాశయంలో అడుగంటిన నీరు



మట్టితో పూడికపోయిన మదుములు

సరుబుజ్జిలి: మెట్ట భూములకు సకాలంలో సాగునీరు అందించేందుకు నిర్మించిన వెన్నెలవసల జలాశయం వలన రైతన్నలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో రబీ వరి, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. ఒకవైపు పంటలకు నీరులేక.. మరోవైపు కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం (అన్నదాత సుఖీభ) అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రిజర్వాయర్ లక్ష్యం ఇదీ..

గిరిజన ప్రాంతాల్లోని భూములకు కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు వృథాగా పోకుండా నిల్వ చేసి, సాగునీటి సదుపాయం అంతగా లేని మెట్ట భూములకు నీటిని అందించేందుకు వెన్నెలవలస, శ్రీరామవలస మధ్యలోని రెండు కొండల నడుమ 400 మీటర్ల గట్టును జలాశయానికి మూడు వైపులా నిర్మించారు. 1991లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి హయాంలో రూ.64 లక్షల 75 వేలతో 4 హెక్టార్ల విస్తీర్ణంలో 12 గ్రామాలకు చెందిన సుమారు 243 ఎకరాలు ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో జలాశయాన్ని ఏర్పాటు చేశారు.

పాడైన కల్వర్టులు..

243 ఎకరాలకు సంబంధించి ఎగువవెన్నెవలవలస, దిగువ వెన్నెవలస, చిగురువలస, తాడికొండ, కొండ్రగూడ, శ్రీరాంవలన, లక్ష్మీపురం తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న భూములకు సాగు నీరు అందించాల్సిన కాలువ కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీని వలన రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీరు అందక చుక్క నీటి కోసం రైతులు అవస్థలు పడుతున్నారు.

పూడికిపోయింది

జలాశయంలో భారీగా పూడిక చేరింది. ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు, పూడిక తొలగించకపోవడం వలన సుమారు 10 అడుగులు లోతు ఉండాల్సింది పోయి మైదానాన్ని తలపిస్తుంది. జలాశయం గట్టు, మదుములు పూర్తిగా శిథిలం కావడం వలన ఏ మాత్రం వర్షం నీరు చేరినా జలాశయంలో నిల్వ చేయడానికి వీలు కుదరడంలేదు. దీని వలన ఎంతో విలువైన సాగునీరు వృథాగా బయటకుపోతుంది. పంటలు చేతికందివచ్చే సమయాల్లో ప్రతి ఏటా సాగునీటి కష్టాలు తప్పడంలేదు. పంటలు రక్షించుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో కొండవాలు దగ్గర ఉన్న ఊటను ఇంజిన్ల ద్వారా తోడుకొని కాపాడుకుంటున్నారు.

మరమ్మతులు చేయడం లేదు



ఏళ్ల తరబడి జలాశయం మదుములు, గట్టు, చెక్ డ్యామ్‌లు, ర్యాంపులను మరమ్మతులు చేయలేదు. అత్యవసర సమయాల్లో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు పర్యవేక్షణ చేసి మరమ్మతులు చేయాలి.

– పి.తవిటినాయుడు, రైతు, మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

మట్టిని తొలగించాలి



జలాశయంలో పూడికతీత పనులు చేయకపోవడం వలన చుక్కనీరు నిల్వ ఉండడం లేదు. మదుములు, గట్టు పూర్తిగా పాడయ్యాయి. నీరు కిందస్థాయి భూములకు అందడం లేదు. కాలువలు పూర్తిగా పూడికపోయాయి. అధికారులు దృష్టి సారించాలి.

– చల్ల ఎర్రయ్య, రైతు, చిగురువలస, సరుబుజ్జిలి మండలం

పరిశీలన చేస్తాం

జలాశయంలో నీటిమట్టం తగ్గడంవలన క్రిందిస్థాయి భూములకు ఇబ్బందులు ఉన్నమాటవాస్తవమే.కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. పనులుకోసం ప్రతిపాదనలు చేసి అనుమతులు కోసం పంపిండం జరుగుతుంది.

– పి.శంకరరావు, జేఈ, నీటిపారుదలశాఖ, సరుబుజ్జిలి మండలం

అగ్ని ప్రమాద స్థలం పరిశీలన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని స్థానిక బండార్లమ్మ వీధిలో రాయల మోహన్‌రావు ఆచారికి సంబంధించిన కర్లమెంట్ (వడ్రంగి పని చేసే షెడ్డు) మంగళవారం రాత్రి కాలి బూడిదైంది. బుధవారం ఉదయం తహసీల్దార్ పాపారావు, స్థానిక వీఆర్వో సోమేశ్వరరావు సంఘటన స్థలాన్ని సందర్శించారు. కర్రకోత మిషన్, కొన్ని పనిముట్లతోపాటు టేకుతో తయారు చేసిన మంచాలు, కుర్చీలు, టేబుల్స్, ఇతర సామగ్రి, షెడ్డు కాలిపోయాయని అధికారుల దృష్టికి బాధితుడు తీసుకెళ్లారు. రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు నష్టపోయినట్లు తెలిపారు. తన ఇద్దరు కుమారులు కూడా ఇదే షెడ్డులో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. నష్టం అంచనా వేసి న్యాయం చేయాలని అధికారులను కోరారు. దీనిపై స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం సంభవించి ఉంటుందా, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



తిరుపతిరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: స్థానిక దువ్వారివీధికి చెందిన 3వ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త, విలేకరిగా పనిచేస్తున్న పెద్దింటి తిరుపతిరావుపై ఈ నెల 20వ తేదీన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యాయత్నం చేశాడు. బుధవారం తిరుపతిరావు ఇంటికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వెళ్లి పరామర్శించారు. దాడికి గల కారాణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉప్పరవీధికి చెందిన కృష్ణారావు ఇటీవల మృతి చెందారు. కృష్ణారావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్ద దేవాంగుల వీధికి చెందిన నీలమణిదుర్గ ఆలయం మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈశ్వరరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, మండల సచివాలయ మాజీ కన్వీనర్ ఏనుగుతల సూర్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండాల అర్జునుడు, పార్టీ నాయకులు నేతాజీ, సుధాకర్, ప్రవీణ్, ధనుంజయ, ఫల్గుణరావు ఉన్నారు.

మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు



ఎల్.ఎన్.పేట: రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజు

ఎల్.ఎన్.పేట: మండలంలో మోడల్ స్కూళ్ల ఏర్పాటు చేసేందుకు, 117 జీఓను ఉపసంహరించేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంఈఓలు నివేదికలు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజు సూచించారు. మండలంలోని చింతలబడవంజ, పూశాం, జాడుపేట గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ పాఠశాలలను బుధవారం పరిశీలించారు. పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. పిల్లల హాజరు మేరకు మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నివేదికలు సకాలంలో సమర్పించాలన్నారు. ఎంపీడీఓ పి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ-2 కె.చంద్రమౌళి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె .ఉపేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

హిరమండలం: మండలంలోని గులుమూరు ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ సీఈఓ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, వారి విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావు, ఎంఈఓలు కె.రాంబాబు, బి.గొల్లవాడు, గ్రామ సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సారవకోట: మండలంలోని అడ్డవనస సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన సద్ది తేజేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం చల్లవానిపేట నుంచి అడ్డవనస గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. నరసన్నపేట నుంచి ఒడిశా వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కారును నిలుపుదల చేయకపోవడంతో స్థానికులు సారవకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సారవకోటలో కారును నిలుపుదల చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసన్నపేటకు తరలించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

పాతపట్నం: గిరిజన యువతకు ప్రభుత్వం సేంక్షమ పథకాలను అందించాలని ఎంపీడీఓ టి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలోని బ్రెడ్స్ కార్యాలయంలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డీబీటీ పథకాలు, ఉపాధి హామీ, పీఎం కిసాన్, ఎన్‌పీసీఐ లింక్, సిక్స్ స్టెప్స్ వాలిడేటేషన్‌తోపాటు 16 రకాల డాక్యుమెంట్స్‌ను గిరిజన గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాల్సి అవసరం గ్రామీణ యువతకు ఉందన్నారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరిని ఎంపిక చేసి, ప్రాజెక్టు లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జె.వి.రమణ, బ్రెడ్స్ ప్రెసిడెంట్ వి.సాంబమూర్తి, కల్యాణ్ రామ్, లోకేష్, అనీష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆమదాలవలస: ఆమదాలవలస ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు చెందిన గీత కులస్తులకు ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను కేటాయించినట్లు సీఐ జి.సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా శ్రీశయన ఉపకులస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు (ఉప కులం) తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2 లక్షలు చెల్లించాలని, ఆ మొత్తం తిరిగి ఇవ్వబడదన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తారన్నారు. పూర్తి వివరాలకు ఆమదాలవలస ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ముగిసిన సదరం క్యాంప్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు చిన్నంనాయుడు

పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సదరం క్యాంప్ బుధవారంతో ముగిసింది. గత మూడు రోజుల నుంచి దివ్యాంగుల పింఛన్ల పునః పరిశీలన చేస్తున్నామని వైద్యులు తెలిపారు. కొత్తూరు మండలానికి చెందిన దివ్యాంగులకు ఆర్థోపెడిక్ రెడ్డి చిన్నాంనాయుడు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పాతపట్నం: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని, చదివిన కళాశాలకు సేవ చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్తమ విద్యార్థులకు ఎమ్మెల్యే రూ.20 వేల నగదును వితరణగా అందజేశారు. విద్యార్థులు డాన్స్‌లతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు కీలకం

నరసన్నపేట: మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని చెన్నాపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రతీ 15 రోజులకు ఒకసారి నీటి తడులు అందించాలన్నారు. కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు పైర్లును గమనిస్తూ ఉండాలన్నారు. పురుగువచ్చినట్లు గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాన్నారు. రబీ వరితోపాటు ఇతర వాణిజ్య పంటల్లో సక్రమంగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వేసవిలో ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రైతు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

జలుమూరు: మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.సరేష్‌కుమార్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం తలతరియా, లింగాలవలస గ్రామాల్లో రైతులకు సూచనలు చేశారు. వేరు శెనగ పంటలో జిప్సం వేయాలన్నారు.

నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పోలాకి: నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షుల నియామక ప్రకటన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వెలువడింది. పార్టీలో క్రియాశీలంగా కొనసాగుతూ, భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి అన్నిరకాలుగా కృషి చేయగలిగిన వారిని గుర్తించినట్లు అయింది. యువజన విభాగం – దండి జయప్రకాశ్, మహిళా విభాగం – గురుగుబెల్లి వెంకటరమణమ్మ, రైతు విభాగం – మడ్డు కృష్ణ, బీసీ సెల్ – డోల సాయికృష్ణ, ఎస్సీసెల్ – కల్లేపల్లి లక్ష్మణరావు, ఎస్టీసెల్ – డెల్లుకుల దండాశి, మైనార్టీ సెల్ – షేక్ బుకారి బాబ్జీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్ – ముచ్చ గణేష్, విద్యార్థి విభాగం – సాలిన నగేష్ కుమార్, పంచాయతీవింగ్ – బగ్గు రమణయ్య, ఆర్టీఐ వింగ్ – చింతాడ వెంకటరావు, వలంటీర్స్ వింగ్ – కరణం గణపతిరావు, గ్రీవెన్స్‌వింగ్ – ధర్మాన జగన్‌మోహన్‌రావు, వాణిజ్య విభాగం – తంగుడు సుబ్రహ్మణ్యం, వీవర్స్ వింగ్ – జాడ లక్ష్మణమూర్తి, వైఎస్సార్ టీయూసీ – యడ్ల రంగారావు, అంగన్‌వాడీ సెల్ – బగ్గ లక్ష్మణరావు, లీగల్‌సెల్ – జి.వి.వి.గణపతినాయుడు, కల్చరల్ వింగ్ – పట్ట ఠాగూర్, సోషల్ మీడియా వింగ్ – పంగ వెంకటరమణ, ఐటీ వింగ్ – బగాది శ్రవణ్‌కుమార్, దివ్యాంగుల విభాగం – చల్ల తవిటయ్య, డాక్టర్స్ వింగ్ – కరవంజ కూర్మారావు, పబ్లిసిటీ వింగ్ – పల్లి కృష్ణమూర్తి, బూత్ కమిటీ విభాగం – సురంగి నర్సింగరావు, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా సదాశివుని కృష్ణను నియమించారు.

ఆదమరిస్తే అంతే..



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో పాలవలస వద్ద రక్షణగోడ పూర్తిగా కూలిపోయింది. రహదారిలో మలుపు ఉండడంతోపాటు ఒక పక్క చెరువు కందకం భారీ లోతులో ఉంది. రక్షణ గోడ శిథిలం కావడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

32 మందికి నేత్ర పరీక్షలు



నరసన్నపేట మండలంలోని కోమర్తి సచివాలయం పరిధిలో గల దేవాది గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని ఉర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పోలాకి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలగంగాధరరాజు 32 మందికి కంటి పరీక్షలు చేశారు. ఐదుగురికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి, మాకివలస పీహెచ్‌సీలో వచ్చే నెల 12న జరగనున్న కంటి వైద్య శిబిరానికి రిఫర్ చేశారు. కోమర్తి ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– నరసన్నపేట

తగ్గిన విస్తీర్ణం



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని మిరియాపల్లి వద్ద అంతంత మాత్రంగా ఉన్న కట్టిజనుము సాగు. నూనె గింజల దిగుబడిని ఇచ్చే కట్టి జనుము సాగు ఆరుతడి పంటగా చేస్తున్నారు. వంశధార నదీ తీర గ్రామాలైన లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, వాడవలస, బసవరాజుపేట, స్కాట్‌పేట, మోదుగువలస, మిరియాపల్లి, దబ్బపాడు, ధనుకువాడ, చిట్టిమండలం, కోవిలాం, రావిచంద్రి తదితర గ్రామాల్లో గతేడాది 90 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 40 ఎకరాల్లో మాత్రమే సాగు అవుతుందని ఏఓ పైడి లతశ్రీ తెలిపారు. ఈ పంటకు పెట్టుబడి ఎక్కువగా అక్కరలేదని, విత్తనాలు వేసుకుంటే ఆరుతడి పంటగా దిగుబడి వస్తుందన్నారు.

– ఎల్.ఎన్.పేట

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలంలోని వసప నుంచి మెట్టూరు వరకు ఉన్న రోడ్డులో జోగిపాడు కాలనీ వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద రోడ్డు బెర్మ్‌ను ఆక్రమించి కంచే ఏర్పాటు చేశారు. ఎదురుగా వస్తున్న వ్యక్తులు, వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, కంచెను తొలగించాలని స్థానికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

– కొత్తూరు

రాళ్లు పడుతున్నాయి..



రైల్వే అండర్ పాసేజ్ పైనుంచి రాళ్లు పడుతున్నట్లు చూపుతున్న బాడాం సర్పంచ్



సిమ్మెంట్ దిమ్మెల మధ్య ఖాళీ ఎక్కువగా ఉన్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని కానుకుర్తివానిపేట రైల్వే అండర్ పాసేజ్ నుంచి సిప్స్ (రాళ్లు) పడుతున్నాయి. పైనుంచి రైళ్లు వెళ్తున్నప్పుడు పట్టాల మధ్య ఉన్న రాళ్లు కిందకు పడుతున్నాయి. ఆ సమయంలో అక్కడ ఉండే వారిపై, వాహనదారులపై పడి పలువురికి గాయాలయ్యాయని స్థానికులు అంటున్నారు. ఈ మార్గంలో బాడాం, తోటాడ, చెన్నాపురం, తదితర గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అండర్ పాసేజ్ నిర్మాణ సమయంలో పైన వేసిన సిమెంట్ దిమ్మల మధ్య ఖాళీలు పెద్దవిగా ఉండటంతో రాళ్లు పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాడాం సర్పంచ్ డోల గోవిందరావు, స్థానికులు కోరుతున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆమదాలవలస: గాజులకొల్లివలసలో పశుఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తు డీడీ మోహన్‌రావు

ఆమదాలవలస: గ్రామాల్లో నిర్వహిస్తున్నామని పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని గాజులకొల్లివలస, హనుమంతుపురం గ్రామాల్లో బుధవారం ఆ శాఖ ఏడీ ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను పరిశీలించారు. పశువులకు వచ్చే వ్యాధులు, లాభసాటి పాడి పరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు హేమలత, ఓంకార్, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు నవ్య, శ్రావణి, పశు వైద్య సిబ్బంది కల్యాణి, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యురాలు బి.శ్రీవాణి అన్నారు. మండలంలోని తామర, తీమర, పాశీగంగుపేట గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాలను పరిశీలించారు. శీతాకాలంలో పశువులకు ఎక్కువగా వ్యాధులు వస్తుంటాయని, పశువైద్యులను సంప్రదించాలన్నారు. దూడలకు డీ వార్మింగ్ మందులు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు, కోళ్లకు కొక్కర వ్యాధి నిరోధక టీకాలు వాడాలన్నారు. యశ్వంత్, శ్యామ్‌సుందర్, మోహన్, పాడి రైతులు పాల్గొన్నారు.